

నాగం నిర్ణయం ఎటో..



నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి దారి ఎటు అనే అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు ఈ పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. దాంతో సీనియర్ నాయకులను ఆకర్షించడంతో పాటు.. ఆయా పార్టీల్లో ఉన్న వారిని గడ పదాటకుండా నడుం బిగించాయి. ఈ నేపథ్యంలో తొమ్మిదేళ్లు మంత్రిగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చక్రం తిప్పిన నాగం జనార్దన్ రెడ్డిని తమ పార్టీలో చేర్చుకునేందుకు బీజేపీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఆ పార్టీ నుంచి ప్రస్తుత బీఆర్ఎస్ ఎంపీ పోతుగంటి రాములు తనయుడు భరత్ ప్రసాద్‌కు నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ ఇచ్చిన విషయం తెలిసిందే. దాంతో నాగంను బీజేపీలో చేర్చుకుంటే తన కుమారుడికి విజయావకాశాలు బలపడుతాయని రాములు భావిస్తున్నారు. ఎలాగైనా ఆయన్ను పార్టీలో చేర్చుకోవాలని ఆ పార్టీ ముఖ్యులను కోరినట్లు విశ్వసనీయ సమాచారం. చంద్రబాబు నాయుడు కేబినెట్‌లో నాగం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి, రాములు క్రీడలు, సాంస్కృతిక శాఖ మంత్రిగా వ్యవహరించారు. దాంతో ఇద్దరి మధ్య రాజకీయ సాన్నిహిత్యం ఉంది. అందుకే నాగంను బీజేపీలో చేర్చుకునేలా రాములు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు జనార్దన్ రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు ఆ పార్టీ సంధి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాగంకు కాకుండా ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు రాజేష్‌రెడ్డికి టికెట్ ఇవ్వడంతో కినుక వహించిన నాగం బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. అయితే ఎన్నికల సమయంలో తమ నాయకుడి సీనియారిటీని పరిగణలోకి తీసుకోకుండా అధిష్ఠానం ఇష్టారీతిన వ్యవహరించిందని, అందుకే ఆ పార్టీని వీడాలని నాగం అనుచరులు, అభిమానులు ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. కార్యకర్తల అభీష్టాన్ని తెలుసుకుని, త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తానని నాగం చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో వారం రోజుల్లో నాగర్‌కర్నూల్ రాజకీయాల్లో కీలకమైన మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

చేపలు మెండు.. కొంగల దండు



కొంగలతో అది కొల్లేటి సరస్సును తలపిస్తోంది.. చెరువు నిండా కొంగలు వాలడం చూసేందుకు ముచ్చటగా ఉన్నది.. చెరువులో నీటికి బదులు నిండా వాలిన తెలుపు, నలుపు కొంగలే కనిపిస్తున్నాయి. వేసవి కావడంతో మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర చెరువులో నీళ్లు అడుగంటాయి. దాంతో చేపలను వేటాడేందుకు వందల సంఖ్యలో కొంగలు చెరువుపై వాలాయి. చెరువు అడుగంటడంతో చేపల కోసం జపం చేయాల్సిన పని లేకుండా సులువుగా వాటిని పట్టి.. భుజిస్తున్నాయి. చెరువు మధ్యలో ఉన్న చిన్నపాటి బండపైన, దాని చుట్టూ వాలిన కొంగలను చూసేందుకు కనుల పండువలా ఉన్నది. ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' బుధవారం క్లిక్‌మనిపించింది.

- ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు, మహబూబ్‌నగర్





మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర చెరువులో వివిధ రకాల పక్షులు







చెరువులో పురుగులు, చేపలను తింటున్న వివిధ రకాల పక్షులు

నేటి నుంచి.. నామినేషన్లు

- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో ఏర్పాట్లు
- 25 వరకు గడువు.. 26న స్ర్కూటీ.. 29 వరకు ఉపసంహరణ
- నేడు డీకే అరుణ, పి.భరత్.. రేపు వంశీచంద్‌రెడ్డి నామినేషన్ దాఖలు
- కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్‌కు హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- జోరందుకోనున్న పార్లమెంట్ ఎన్నికల ప్రచారం



మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 17: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం నుంచి మొదలుకానుంది. నామినేషన్‌ల కోలాహలం మొదలయ్యిందంటే రాజకీయ వాతావరణం మరింత వేడెక్కనుంది. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలకు ప్రధాన పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేశాయి. నామినేషన్లు దాఖలు చేసేందుకు ముహూర్తాలు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు సంబంధించి కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో రిటర్నింగ్ అధికారి నామినేషన్లు స్వీకరిస్తారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు సంబంధించి అక్కడి కలెక్టరేట్‌లో నామినేషన్లు తీసుకుంటారు. 26న స్ర్కూటీ, 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉండనుంది. ఆ తరువాత పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు ప్రకటించనున్నారు. మే 13న ఎన్నికలు జరుగనున్నాయి. జూన్ నాల్గున ఓట్ల లెక్కింపు ఉంటుంది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఓట్ల లెక్కింపు పాలమూరు యూనివర్సిటీలో ఉండగా, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఓట్ల లెక్కింపు అక్కడి వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో చేపట్టనున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 16,75,202 మంది ఓటర్లు ఉండగా.. 1,937 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 17,31,821 మంది ఓటర్లుండగా, 2,067 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు.

ముహూర్తాలు చూసుకుంటున్న అభ్యర్థులు

మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ నుంచి చల్లా వంశీచంద్‌రెడ్డి పోటీ చేస్తుండగా, బీజేపీ నుంచి డీకే అరుణ, బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి బరిలో ఉన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ నుంచి డాక్టర్ మల్లురవి, బీజేపీ నుంచి భరత్‌కుమార్, బీఆర్ఎస్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తలపడుతున్నారు. వీరితోపాటు ఈ రెండు పార్లమెంట్‌ల పరిధిలో బీఎస్పీతో పాటు పలువురు ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటీ పడేందుకు సిద్ధమవుతున్నారు. బీజేపీ నుంచి మహబూబ్‌నగర్ అభ్యర్థి డీకే అరుణ, నాగర్‌కర్నూల్ అభ్యర్థి పి.భరత్ గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 11:15 గంటలకు ఆమె నామినేషన్ పత్రాలను సమర్పించనున్నారు. అంతకుముందు కాటన్‌మిల్లు వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి, బైక్ ర్యాలీతో కలెక్టరేట్‌కు చేరుకుంటారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి 19న ఉదయం 9:10 గంటలకు నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. నామినేషన్ అనంతరం ముఖ్యమంత్రి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడతారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్ తేదీ ఖరారు కావాల్సి ఉంది.

హీటెక్కనున్న రాజకీయం

నామినేషన్‌లు వేశారంటే ప్రచారపర్వం జోరందుకోనుంది. ఇప్పటికే ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ హోరాహోరీగా ప్రచారం చేస్తున్నాయి. ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయ వాతావరణం వేడెక్కగా, రానున్న రోజుల్లో కురుక్షేత్రంగా మారనుంది. అన్ని పార్టీల ముఖ్య నాయకులు ప్రచారానికి బారులు తీరనున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే మూడుసార్లు మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో పర్యటించారు. బీజేపీ, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు కూడా రంగంలోకి దిగనున్నారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ.. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం, రైల్వే లైన్‌లు, సైనిక్ స్కూల్, మరోవైపు కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ప్రధాన ప్రచార అస్త్రాలుగా వాడుకుంటున్నాయి. బీఆర్ఎస్ రైతు సమస్యలను ప్రధానంగా ఎన్నికల అస్త్రంగా వినియోగించుకుంటోంది.

ఏర్పాట్లు పూర్తి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. అభ్యర్థితోపాటు మూడు వాహనాలను మాత్రమే అనుమతించనున్నారు. మిగతా వాహనాలను 100 మీటర్ల దూరంలోనే నిలిపి వేయాల్సి ఉంటుంది. అభ్యర్థితోపాటు ఐదుగురిని మాత్రమే నామినేషన్ దాఖలు చేసే హాల్‌లోకి అనుమతిస్తారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ పరిధిలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.



బందోబస్తు సిబ్బందికి సూచనలు చేస్తున్న పోలీసు అధికారులు

ఎల్‌ఆర్‌ఎస్‌పై అనాసక్తి

- పురపాలికల్లో క్రమబద్ధీకరణకు ముందుకురాని దరఖాస్తుదారులు
- 1.89 లక్షల దరఖాస్తులకు కేవలం 446 మందే ఫీజు చెల్లింపు
- వారి ద్వారా రూ.1.93 కోట్ల ఆదాయం
- దరఖాస్తులన్నీ క్రమబద్ధీకరించుకుంటే రూ.వందల కోట్ల ఆదాయం
- డెడ్‌లైన్ లేకపోవడంతో నిరాసక్తత



మహబూబ్‌నగర్ మునిసిపల్ కార్యాలయం



మహబూబ్‌నగర్ పట్టణం

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 17: పురపాలికల్లో లేఅవుట్ రెగ్యులరైజేషన్(ఎల్‌ఆర్‌ఎస్) కోసం ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవడం లేదు. దీనిపై దరఖాస్తు సమయంలో ఉన్న ఆసక్తి... క్రమబద్ధీకరణకు చూపడం లేదు. లేఅవుట్ క్రమబద్ధీకరణల కోసం గత ప్రభుత్వం 2020లో దరఖాస్తులను ఆహ్వానించింది. ఆ సమయంలో దరఖాస్తుకు రూ.1,000 ఫీజుగా నిర్ణయించింది. దరఖాస్తులు చేసుకుని మూడేళ్లు అవుతున్నా అందుకు అవకాశం ఇవ్వకపోవడంతో అప్పటి నుంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫిబ్రవరి 25న మరో అవకాశం కల్పించింది. మార్చి 31లోగా పురపాలికలకు ఫీజు చెల్లించి, లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలని చెప్పింది. 2020లో దరఖాస్తు చేసుకున్న సమయంలో అప్పటి ప్రభుత్వం నిర్ణయించిన ఫీజునే చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే దరఖాస్తుదారుల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో కటాఫ్ తేదీని ఎత్తేసింది. ఏప్రిల్ 15 నాటికి కూడా నామమాత్రంగా కొందరే దరఖాస్తు ఫీజు చెల్లించారు.

1,89,424 దరఖాస్తులు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోని 19 పురపాలికల పరిధిలో గత ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తులు ఆహ్వానించగా.. 1,89,424 మంది అర్జీ పెట్టుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారంతా ఫీజు చెల్లించి, క్రమబద్ధీకరణ చేసుకోవాలని ప్రభుత్వం ఇటీవల అవకాశం కల్పించింది. పెద్ద ఎత్తున దరఖాస్తుదారులు ముందుకు వస్తారని భావించగా.. వారి నుంచి స్పందన కరువైంది. దాంతో అధికారులు దరఖాస్తుదారుల వెంట పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దరఖాస్తుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని అధికారులు రిజెక్ట్ చేశారు. మిగతా వాటిని పరిశీలించి, డాక్యుమెంట్‌లు లేకపోతే ఇవ్వాలని, మరికొన్నింటిని ఫైనల్ చేసి ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చినా పెద్దగా ఆసక్తి చూపడం లేదు. 1.89 లక్షల దరఖాస్తుల్లో ఇప్పటి వరకు కేవలం 446 మందే ఫీజు చెల్లించి, లేఅవుట్‌లను క్రమబద్ధీకరణ చేసుకున్నారు. వీటిద్వారా పురపాలికలకు రూ.1,93,97,495 ఆదాయం సమకూరింది. మొత్తం దరఖాస్తులు క్లియర్ అయితే వందల కోట్ల రూపాయల ఆదాయం రానుంది. ఎల్‌ఆర్ఎస్ చేసుకునేందుకు ఫీజు కూడా ఎక్కువగా ఉండటంతో అంత మొత్తం చెల్లించలేని వారు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

ప్రతిపక్షాలు ఇదివరకు ఎల్‌ఆర్ఎస్‌లను ఉచితంగా ప్రభుత్వమే చేయాలని ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే చాలా పురపాలికలకు ఆదాయం అంతంత మాత్రంగానే ఉండటంతో వీటి ద్వారానైనా ఆదాయం వస్తుందని ప్రభుత్వం భావించగా, ఆశించిన ఫలితం రావడం లేదని తెలుస్తోంది.

పురపాలికల వారీగా వచ్చిన దరఖాస్తులు, చెల్లింపులు చేసినవి, వచ్చిన ఆదాయం వివరాలు

క్ర.సం	పురపాలిక	దరఖాస్తులు	చెల్లింపులు చేసినవి	ఆదాయం
1	మహబూబ్‌నగర్	31,144	129	67,52,678
2	అచ్చంపేట	11,971	92	20,97,790
3	అలంపూర్	425	--	---
4	ఆత్మకూర్	3,788	--	--
5	అమరచింత	438	04	65,999
6	భూత్పూర్	5,999	21	4,56,852
7	గద్వాల	14,317	37	17,66,621
8	అయిజ	9,767	9	1,93,592
9	కల్వకుర్తి	11,443	41	11,54,244
10	కొల్లాపూర్	4,565	17	3,32,574
11	కోస్గి	3,909	04	97,849
12	కొత్తకోట	2,491	10	3,29,058
13	మక్తల్	10,498	1	90,467
14	నాగర్‌కర్నూల్	16,011	12	2,95,627
15	పెబ్బేరు	7,261	--	--
16	జడ్చర్ల	17,564	16	8,27,834
17	వడ్డేపల్లి	1,930	--	--
18	నారాయణపేట	6,962	32	10,51,875
19	వనపర్తి	28,941	21	38,84,435
మొత్తం		1,89,424	446	1,93,97,495

నిర్లక్ష్యం వహించొద్దు

- అగ్నిమాపక కేంద్రం అధికారి చంద్రశేఖర్ - జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో అవగాహన

వనపర్తి వైద్యవిభాగం, ఏప్రిల్17: : ఒక చిన్న నిప్పురవ్వను నిర్లక్ష్యం చేసినా అది పెను ప్రమాదానికి కారణం కావచ్చని అగ్నిమాపక కేంద్రం అధికారి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో ఆర్ఎంవో డాక్టర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో అగ్నిమాపక అధికారులు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలి, మంటలు ఎలా ఆర్పాలి అనే వివరాలను ప్రయోగం ద్వారా వివరించారు. కార్యక్రమంలో జనరల్ ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ శివప్రసాద్, వైద్యులు, హెడ్‌నర్సు రజిని, వైద్య సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది నర్సింహారెడ్డి, బాల్‌రాజు, కిరణ్, బాలకొండ తదితరులు పాల్గొన్నారు.



అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో మంటలను ఆర్పుతున్న డాక్టర్ శివప్రసాద్

ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ..

ఆత్మకూరు: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక సిబ్బంది ఆసుపత్రి సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ప్రమాదం జరిగిన స్థలంలో అగ్నికి తొందరగా ఆహుతి అయ్యే వస్తువులను అక్కడి నుంచి తొలగించాలని సూచించారు. అనంతరం ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఫైర్ స్టేషన్ వలయాధికారి శ్రీనివాస రావు, సిబ్బంది సంజీవరెడ్డి, గోపాల్‌రెడ్డి, భానుచందర్ , వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణ వైభోగమే..

- కనులపండువగా సీతారాముల కల్యాణం

చారకొండ, ఏప్రిల్ 17: నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం రెండో అపర భద్రాద్రిగా పేరుగాంచిన సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి దేవాలయంలో బుధవారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకను చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ చైర్మన్ ధేరం రామశర్మ స్వామివారికి పట్టువస్త్రాలు, పుస్తె, మెట్టెలు, ముత్యాల తలంబ్రాలను తీసుకొచ్చారు. మంగళ వాయిద్యాల మధ్య కల్యాణాన్ని కనుల పండువగా చేశారు. కల్యాణం అనంతరం భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. ముక్కిడి పోచమ్మ, మైసమ్మ దేవతలను కూడా దర్శించుకున్నారు. కల్యాణం అనంతరం మండపానికి భక్తులు ఒకేసారి దూసుకురావడంతో భక్తులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. భక్తుల కోసం గుట్టపైకి ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం, తాగు నీరు, చలువ పందిళ్లు వంటి సౌకర్యాలు కల్పించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అంతకముందు ఎస్పీ దంపతులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. వారిని ఆలయ చైర్మన్ సత్కరించారు.

బైక్, కారు ఢీకొని యువకుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 17 : బైక్, కారు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుబట్ల గ్రామానికి చెందిన పూజారి శివ(25) బుధవారం నాగర్‌కర్నూల్ నుంచి గ్రామానికి వెళ్తుండగా వెలమ ఫంక్షన్‌హాల్ సమీపంలో వేగంగా వచ్చిన ఇన్నోవా కారు పల్సర్ బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జేబుదొంగకు దేహశుద్ధి

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 17 : జిల్లా కేంద్రంలోని రామాలయం వద్ద సీతారాముల కల్యాణం జరుగుతుండగా ఓ దొంగ జేబు దొంగతనానికి పాల్పడ్డాడు. గమనించిన భక్తులు దొంగను గుర్తించి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

వ్యక్తిపై హత్యాయత్నం

» తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స

తిమ్మాజిపేట, ఏప్రిల్ 17 : భూతగాదాలు, పాత కక్షలను మనసులో పెట్టుకొని ఓ వ్యక్తిని మరో వ్యక్తి కారుతో ఢీకొట్టి కర్రలతో దాడి చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం గొరిట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండీ.అజీజ్‌కు అదే గ్రామానికి చెందిన ఎండీ.జాఫర్ అనే వ్యక్తితో గత కొన్నాళ్లుగా భూతగాదాలు ఉన్నాయి. కాగా, బుధవారం గొరిట నుంచి చేగుంట వెళ్లే ప్రధాన రహదారిపై అజీజ్ ఒంటరిగా ఉండటాన్ని గమనించిన జాఫర్, ఎండీ.మతిన్ కారులో వచ్చి ఢీకొట్టడమే కాకుండా కర్రలతో బలంగా కొట్టి హత్యాయత్నం చేశారని అజీజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. గాయాలపాలైన అజీజ్ మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వారు చెప్పారు.

గడ్డివామి దగ్ధం

» రూ.రెండు లక్షల ఆస్తి నష్టం

బిజినేపల్లి, ఏప్రిల్ 17 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం చిన్నపీరు తండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఢాకుతండాలో గడ్డివాము దగ్ధమైంది. తండాలో రైతు పీక్లానాయక్‌కు చెందిన గడ్డివాము బుధవారం ప్రమాదవశాత్తు దగ్ధమై రూ.రెండు లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. గుర్తు తెలియని వ్యక్తులు బీడీ తాగి ఆర్పివేయకుండా వేయడం వల్ల గడ్డివాము అంటుకొని ఉండవచ్చని తండావాసులు అనుమానం వ్యక్తం చేశారు.



ఢాకు తండాలో దగ్ధమవుతున్న గడ్డివామి

వ్యక్తి మృతదేహం లభ్యం

వనపర్తి టౌన్, ఏప్రిల్ 17 : వనపర్తి జిల్లా కేంద్రంలోని నల్లచెరువులో మంగళవారం ప్రమాదవశాత్తు చెరువులో పడి గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెలికితీశారు. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కేంద్రంలోని రాయిగడ్డ కాలనీకి చెందిన ఉండెకోటి కృష్ణ(42) మంగళవారం సాయంత్రం ముగ్గురు స్నేహితులతో కలిసి నల్ల చెరువులో ఈతకు వెళ్లాడు. ఈత కొడుతూ కృష్ణ ప్రమాదవశాత్తు చెరువులో పడి గల్లంతు కాగా, బుధవారం అతని మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెతికి బయటకు తీశారు.


నల్లచెరువు వద్ద సహాయక చర్యలను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

సహాయక చర్యలను పరిశీలించిన చిన్నారెడ్డి, మేఘారెడ్డి

నల్లచెరువులో పడి వ్యక్తి గల్లంతైన విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బుధవారం ఉదయం నల్ల చెరువు వద్దకు చేరుకున్నారు. మత్స్యకార సంఘం, పోలీస్ శాఖ, అగ్నిమాపక శాఖ, మునిసిపాలిటీ అధికారులు చేపట్టిన సహాయక చర్యలను వారు దగ్గరుండి పరిశీలించారు. గద్వాల నుంచి గజ ఈతగాళ్లను పిలిపించిన చిన్నారెడ్డి దాదాపు రెండు గంటల అనంతరం వారు వ్యక్తి మృతదేహాన్ని బయటికి తీశారు. మృతి చెందిన వ్యక్తి ఉండెకోటి కృష్ణగా స్థానికులు, కుటుంబ సభ్యులు నిర్ధారించారు. అంతకుముందు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ చెరువుల్లో ఈతకు వెళ్లేవారు ఎట్టి పరిస్థితుల్లోను మద్యం తాగకూడదని, సరదా కోసమని, ఆకతాయి చేష్టలతో వెళ్లి మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు శోకం మిగులుతోందన్నారు. సంబంధిత అధికారులు, మత్స్యశాఖ సిబ్బంది చెరువుల వద్ద తగిన నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, మత్స్యకార సంఘం జిల్లా చైర్మన్ నందిమల్ల యాదయ్య, నాయకులు ఉన్నారు.



పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది.

-భద్రాచలం

● కనుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక


జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం


కల్యాణాన్ని వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


స్వామివారి ఊరేగింపు


ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు


గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



సివిల్స్ ఫలితాల్లో

గిరిజన బిడ్డకు ర్యాంక్


అనుప్రియ

బాలానగర్, ఏప్రిల్ 17 : మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన నేనావత్ అనుప్రియ యూపీఎస్సీ ఫలితాల్లో 914వ ర్యాంక్ సాధించారు. సివిల్స్ ఫలితాల్లో తమ గ్రామానికి చెందిన గిరిజన ఆడబిడ్డ ఐఏఎస్ సాధించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అత్త, భార్య దాడి చేశారని అల్లుడి ఫిర్యాదు

అమరచింత, ఏప్రిల్ 17 : గొడవ పడిపోయిన భార్యను పిలవడానికి వెళ్తే భార్య, అత్త కలిసి దాడి చేశారని ఓ అల్లుడు అమరచింత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా అమరచింత మండలం చంద్రఘడ్ గ్రామానికి చెందిన చెన్నారెడ్డి తన భార్యతో మంగళవారం రాత్రి గొడవ పడగా ఆమె కోపంతో తల్లిదండ్రుల గ్రామమైన పామిరెడ్డిపల్లికి వెళ్లిపోయింది. అత్తమామల వద్దే ఉంటున్న తన భార్యను కాపురానికి రమ్మని పిలవడానికి వెళ్తే ఆగ్రహంతో అత్త, భార్య కలిసి దాడి చేశారని భర్త చెన్నారెడ్డి అమరచింత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చెన్నారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నగదు పట్టివేత

రాజాపూర్/పాన్‌గల్/పెద్దమందడి, ఏప్రిల్ 17 : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ గ్రామ శివారులోని జాతీయ రహదారి-44పై ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీలో మూడు వేర్వేరు బొలెరో వాహనాల్లో మొత్తం రూ.2.15 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవి తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆత్మకూర్ వెళ్తున్న హైమద్ పాషాతో పాటు, మరో ఇద్దరు వ్యక్తులు బీచుపల్లి, సహదేవనాయుడుల వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకొని జిల్లా ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. అదేవిధంగా, వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లి గ్రామంలో బుధవారం తనిఖీలు నిర్వహిస్తుండగా రూ.లక్ష పట్టుబడినట్లు ఎస్సై వేణు తెలిపారు. ఎర్రవల్లికి చెందిన హుస్సేన్ కొల్లాపూర్ నుంచి వనపర్తికి కారులో వెళ్తుండగా నగదును పట్టుకున్నట్లు ఆయన చెప్పారు. ఇదే జిల్లా పెద్దమందడి పోలీస్‌స్టేషన్ పరిధిలో గల మోజర్ల చెక్‌పోస్టు వద్ద రూ.లక్షా 52 వేల నగదును పట్టుకున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

కేసీఆర్ ఎకో పార్క్‌లో యువతి అనుమానాస్పద మృతి

- హత్యా.?, ఆత్మహత్యా.?
- కాలిపోయిన మృతదేహం
- సీసీ పుటేజీల ద్వారా యువతిని గుర్తించేందుకు పోలీసుల యత్నం

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 17 : మహబూబ్‌నగర్ మునిసిపల్ పరిధిలోని అప్పన్నపల్లి గ్రామ శివారులోని కేసీఆర్ అర్బన్ ఎకో పార్క్‌లో ఓ యువతి కాలిపోయిన దేహం లభ్యమవడం కలకలం రేపుతోంది. పార్కు అభివృద్ధి చెందిన తరువాత ప్రతీరోజు వందల్లో సందర్శకులు వెళుతున్నారు. తొలిసారి పార్కులో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో చనిపోవడం చర్చనీయాంశంగా మారింది. బుధవారం జనమంతా శ్రీరామనవమి వేడుకల్లో ఉండగా నిత్యం సందర్శకులతో కిటకిటలాడే పార్కులో ఈ ఘటన చోటు చేసుకోవడం విచారకరం. ఉదయం 11 గంటల సమయంలో పార్కు ప్రధాన గేటు నుంచి కిలోమీటర్ దూరంలో కొండపై జాతీయ జెండాను ఏర్పాటుచేసిన ప్రాంతానికి సమీపంలో అడవిలో పొగ రావడంతో పార్కు సిబ్బంది అక్కడికెళ్లి చూడగా నిప్పంటుకుని కాలిపోతున్న యువతి కనిపించడంతో ఖంగు తిన్నారు. మంటలు ఆర్పేందుకు ప్రయత్నించే సరికే శరీరం అంతా కాలిపోయి యువతి చనిపోయింది. ఈ విషయాన్ని పోలీసులకు తెలుపగా రూరల్ పోలీసులు అక్కడికి క్లూస్ టీమ్‌తో చేరుకుని వివరాలు సేకరించారు. యువతి సెల్‌ఫోన్ కూడా దగ్ధమైంది. ఒంటిపై ఉన్న డ్రస్ సగం కాలిపోగా, మిగిలిన డ్రస్ ఆధారంగా పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. సీసీ పుటేజీలో ఆ డ్రస్ కలర్ ఆధారంగా యువతిని గుర్తిస్తే ఆమె ఒక్కరే పార్కులోకి వెళ్లారా.?, ఎవరైనా వెంట ఉన్నారా అన్న విషయం తేలుతుంది. ఆమె చేతిలో ఏదైనా బ్యాగ్, కవర్ లాంటివి ఉన్నాయా అన్న విషయాలు తేలనున్నాయి. అడవిలో ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటే వెంట కిరోసిన్ లేదా పెట్రోల్ తీసుకుని వెళ్లాలి. సీసీ పుటేజీలో అమ్మాయిని గుర్తిస్తే వెంట ఎవరున్నది.?, చేతిలో కవర్ ఏమైనా ఉన్నదా అన్న విషయాలు వెలుగులోకి రానున్నాయి. పార్కులోకి ఎక్కువగా ప్రేమ జంటలు వెళుతుంటాయి. అలాంటి కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె వెంట ఎవరైనా అబ్బాయి ఉంటే గనక అమ్మాయితో వచ్చిన విభేదాల కారణంగా ముందుగానే ప్లాన్ చేసుకుని హత్య చేసి, ఆ తరువాత నిప్పంటించి ఉండాలన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన జరిగినపుడు ఆ ప్రాంతంలో సందర్శకులెవరూ లేరు. యువతి పూర్తిగా కాలిపోవడం, ఆమెకు సంబంధించిన వివరాలేవీ ఘటనా స్థలంలో లభించలేదని రూరల్ సీఐ గాంధీనాయక్ తెలిపారు. సీసీ పుటేజీలో యువతిని గుర్తిస్తే అసలు విషయాలు వెలుగులోకి రానున్నాయని చెప్పారు. మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉలిక్కిపడ్డ అటవీ శాఖ

రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన కేసీఆర్ అర్బన్ ఎకో పార్కులో మొదటిసారి ఓ యువతి అనుమానాస్పదంగా చనిపోవడంతో అటవీ శాఖ అధికారులు ఉలిక్కి పడ్డారు. పార్కు విశాలంగా ఉండటం, దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఇకముందు మరిన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మనషులకు కనిపించే దూరం వరకు మాత్రమే జనాలను అనుమతించాలని, నిత్యం ఇద్దరు, ముగ్గురు గార్డ్‌లు పార్కు నంతా తిరుగుతూ పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది.

ఇసుక టిప్పర్ పట్టివేత

నవాబ్‌పేట, ఏప్రిల్ 17 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై అభిషేక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పత్తేపూర్ గేటు నుంచి రుద్రారం వైపు వస్తున్న ఇసుక టిప్పర్‌ను గమనించిన పెట్రోలింగ్ పోలీసులు వాహనాన్ని ఆపి విచారించారు. అనుమతి పత్రాలు చూపించమని పోలీసులు కోరడంతో డ్రైవర్ పారిపోయేందుకు యత్నించాడు. పట్టుకున్న పోలీసులు డ్రైవర్‌తో పాటు, వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. టిప్పర్ జడ్చర్ల మండలం ఖానాపూర్‌కు చెందిన రాజేందర్‌దిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పడమటి గార్లపాడు శివారులో మినీ టిప్పర్..

రాజోలి, ఏప్రిల్ 17 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పడమటి గార్లపాడు శివారులో తుంగభద్ర నది నుంచి ఇసుకను తరలిస్తున్న మినీ టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పి.గార్లపాడు గ్రామ శివారులోని తుంగభద్ర నది నుంచి ఇసుకను తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి కానిస్టేబుల్ మధుసూదన్, హోంగార్డు తనిఖీలు నిర్వహించారు. ఒక మినీ టిప్పర్ పి.గార్లపాడు నుంచి తుమ్మిళ్ల మీదుగా వెళ్తుండగా పట్టుకుని పరిశీలించగా ఇసుక తరలింపు బయటపడిందన్నారు. ఇసుకకు సంబంధించి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, పట్టుబడిన టిప్పర్ రాజోలికి చెందిన గొల్ల తిరుమలేష్‌కు చెందినదిగా పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత, కేసు నమోదు

రాజోలి, ఏప్రిల్ 17 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం ముండ్లదిన్నె గ్రామంలో రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాయకి మల్లికార్జున్ అనే వ్యక్తి గ్రామంలో హోటల్ వ్యాపారం చేసుకుంటున్నాడు. ఇతను గ్రామంలో రేషన్ లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి, కర్నూలు, రాయచూర్ జిల్లాల్లో అధిక ధరలకు అమ్ముకుంటున్నట్లు వచ్చిన సమాచారం మేరకు బుధవారం తనిఖీలు నిర్వహించామన్నారు. మల్లికార్జున్ పశువుల కొట్టంలో దాదాపు 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. బియ్యాన్ని స్టేషన్‌కు తరలించి, మల్లికార్జున్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బెల్టు షాపుపై దాడి..

మిడ్జిల్, ఏప్రిల్ 17 : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం చిల్వేరు గ్రామంలోని బెల్టు షాపులపై పోలీసులు బుధవారం ఆకస్మికంగా దాడులు చేశారు. ఓ దుకాణంలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆనంద్ తెలిపారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

- జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లిలో 43.9 డిగ్రీల నమోదు

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల/వనపర్తి అర్బన్, ఏప్రిల్ 17 : భానుడి ప్రతాపానికి జనం ఉక్క పోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండవేడిమికి జనం అల్లాడుతున్నారు. బుధవారం 43.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదవడం, దీనికితోడు వడగాల్పులు వీయడంతో ప్రజలు తట్టుకోలేకపోయారు. రాత్రి 8 గంటలైనా ఉక్కపోత తగ్గడం లేదు. ఎండలకు ఇళ్ల నుంచి బయటకు వెళితే మాడు పగిలేంత వేడిమి ఉండటంతో బయటకు వెళ్లడానికి జనం భయపడుతున్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. వడ్డేపల్లిలో 43.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలంపూర్‌లో 42.6, గద్వాలలో 42.1, ధరూర్‌లో 41.8, ఇటిక్యాలలో 31.2, కేటీదొడ్డిలో 41.1, అయిజలో 41, ఉండవెల్లిలో 40.1, మానవపాడులో 40, మల్దకల్, గట్టులలో 39.9 డిగ్రీలు నమోదైంది.

వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో 43.7 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. కొత్తకోట 43.0, పెబ్బేరు 42.2, గోపాల్‌పేట 42.1, శ్రీరంగాపూర్ 42.0, చిన్నంబావి 41.9, పెద్దమందడి 41.9, వనపర్తి 41.5, ఆత్మకూరు, ఘణపూర్‌లలో 41.2, మదనాపూర్ 41.0, రేవల్లి 40.8, వీపనగండ్ల 40.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది.

మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలో 43.2 డిగ్రీలు నమోదవగా, బాలానగర్‌లో 42.4, దేవరకద్రలో 42.3, మిడ్జిల్‌లో 42.1, కోయిలకొండ, మూసాపేటలో 42, సీసీకుంటలో 41.7, అడ్డాకులలో 41.6 డిగ్రీలు నమోదు కాగా మహబూబ్‌నగర్‌లో 41.3, జడ్చర్లలో 41.5, భూత్పూర్‌లో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో 43.0, కల్వకుర్తిలో 42.4, అచ్చంపేటలో 41.9, పెద్దకొత్తపల్లిలో 41.6, నాగర్‌కర్నూల్‌లో 41.4, కొల్లాపూర్‌లో 41.1, లింగాలలో 40.8, ఉప్పునుంతలలో 40.5, పదరలో 40.3, తెల్కపల్లిలో 40.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నారాయణపేట జిల్లా కోస్గి మండలంలో 39 డిగ్రీలు, మక్తల్‌లో 40, నర్వలో 39, కృష్ణలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

సమావేశాన్ని విజయవంతం చేయండి

మదనాపురం, ఏప్రిల్17: బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని జడ్పీటీసీ సభ్యుడు కృష్ణయ్యయాదవ్ అన్నారు. బుధవారం నెల్విడి, నర్సింగాపురం, గ్రామాలలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న మండలంలోని దంతనూరు గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బిట్లి యాదగిరి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, రాంనారాయణ, కోట్ల తిరుపతయ్య, రాజ్‌కుమార్, కురుమూర్తి, కృష్ణ, కావలి అంజి, ధోని, మాసన్నయాదవ్ ఉన్నారు.

హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి: రూరల్ ఎస్ఐ

వనపర్తి రూరల్,ఏప్రిల్17: ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని రూరల్ ఎస్ఐ జలంధర్ రెడ్డి సూచించారు. బుధవారం వనపర్తి మండల పరిధిలోని కడుకుంట్లలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వొద్దని అన్నారు. రాత్రివేళలో ఆరుబయట నిద్రించేటప్పుడు ఇళ్లకు తాళాలు వేసుకుని ఉండాలన్నారు.

తాగునీటి కోసం నిధులు మంజూరు

పెద్దమందడి, ఏప్రిల్17: తాగునీటి కోసం నిధులు మంజూరు అయినట్లు ఎంపీపీ రఘుప్రసాద్ తెలిపారు. మండలంలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా బుధవారం ప్రత్యేక నిధులు రూ. 40.80లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీపీ తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రజల తరపున ఎంపీపీ కృతజ్ఞతలు తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

- విజేతను సన్మానించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

ఖిల్లాఘణపురం,ఏప్రిల్17: మండల కేంద్రంలోని కుమ్మరిగేరి ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణంలో బుధవారం శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన కమ్ము నారాయణను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు. వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 16 మంది యువకులు పాల్గొని ప్రతిభ చాటారు.

వృషభరాజుల బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న కొత్త కళ్యాణ్ రావు

చిన్నంబావి,ఏప్రిల్17: మండల పరిధిలోని పెద్దదగడ గ్రామంలో సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా బండలాగుడు పోటీలను నిర్వ హించారు. కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ కొత్త కళ్యాణ్ రావు బండలాగుడు పోటీలను ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.25వేలు, రెండవ బహుమతి రూ.20వేలు, మూడవ బహుమతి రూ.15వేలు, నాల్గవ బహుమతి రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పుష్పలత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండడి చిదంబర్ రెడ్డి, మండల అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ బీచుపల్లి యాదవ్, సాగర్‌రావు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పట్టణ ప్రముఖులను కలిసిన మాజీ ఎమ్మెల్యే



అమరచింత మునిసిపల్ చైర్ పర్సన్ కుటుంబ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే

అమరచింత, ఏప్రిల్17: పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి డీకే అరుణకు మద్దతు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే భరత సింహారెడ్డి కోరారు. బుధవారం రాత్రి ఆయన అమరచింతలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మునిసిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ నాగభూషనం గౌడ్ , కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవరకొండ లచ్చన్న, మాజీ వార్డు మెంబర్ శ్రీను తదితర ఇళ్లకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీలకు అతీతంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి అరుణమ్మకు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండి ఈ ప్రాంత అభివృద్ధిపై పూర్తిస్థాయిలో పట్టున్న అరుణమ్మకు మద్ధతు ఇస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా భరత సింహారెడ్డి బీజేపీ నాయకులు కాకుండా ఇతర పార్టీ నాయకులు తమకున్న సన్నిహితులకు ఫోన్ల ద్వారా మద్దతు కూడ పెట్టుకుంటున్నారు. భరత సింహారెడ్డి వెంట బీజేపీ నాయకులు మేర్వ రాజు క్యామ భాస్కర్, మరాఠీ అశోక్, నరాల నారాయణ, సిద్ద రాములు, దుబాయ్ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులున్నారు.

అట్టహాసంగా బండ్ల గిరక పోటీలు

ఆత్మకూరు,ఏప్రిల్17: శ్రీరామనవమి సందర్భంగా ఆత్మకూరు మండల పరిధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఎద్దుల బండ్ల గిరక పోటీలను రైతు సంఘం కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల నుండి 23 ఎద్దుల జట్లు పాల్గొనగా మొదటి బహుమతి మన్నాపురం కాశీం సాధించగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి రూ.20వేల నగదును అందజేశారు. అలాగే రెండో బహుమతి కుర్వేనిర్ల ఋషి సాధించగా 10వేల నగదును తెలంగాణ గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు గౌడ్ అందజేశారు. మూడో బహుమతి గంగనపల్లి దర్ప సాధించగా నారాయణపేట కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి అందజేశారు. నాలుగో బహుమతి చిట్యాల నవీన్ సాధించగా ఆత్మకూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్, మాజీ అధ్యక్షులు రహమత్ , పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్, మక్తల్ యూత్ అధ్యక్షులు తులసి రాజులు అందజేశారు. అనంతరం నాగరాజు గౌడ్ మాట్లాడుతూ... శ్రీరామనవమి సందర్భంగా ఎద్దుల బండ్ల గిరక పోటీలను నిర్వహించడం సంతోషదాయకమని ప్రతి యేడు ఇలాగే నిర్వహించి రైతులు ఉత్సాహంగా పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజశేఖర్, సహదేవ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ, సుధాకర్, ఆనంద్, నరేష్ కుమార్, ఖాజా పాషా, గజేందర్ రెడ్డి పాల్గొన్నారు.


కరాటే గ్రేడింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొత్తకోట, ఏప్రిల్ 17 : పట్టణంలోని గాడ్స్‌ఆన్ వారియర్ చోటోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన గ్రేడింగ్ పోటీల్లో కరాటే విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు అకాడమీ చైర్మన్ మాస్టర్ అబ్దుల్ నబీ తెలిపారు. ఎల్లో బెల్ట్ 6 మంది, ఆరెంజ్ బెల్ట్ 15 మంది గ్రీన్ బెల్ట్ నలుగురు బ్లూ బెల్ట్ ఒకరు మెరూన్ బెల్ట్ నలుగురు అందుకున్నారు. విద్యార్థులను అకాడమీ కరాటే మాస్టర్లు హరీష్ యాదవ్, జాఫర్ సాదిక్, శివరాజ్, పరమేష్, కురుమూర్తి యాదవ్, ఇంతియాజ్, ఎండీ. జహంగీ ర్, సుమ, హఫీజ్, లాస్య, హర్షవర్ధన్, కార్తికేయ యాదవ్ అభినందించారు.

ప్రమాదంలో కొత్తపల్లి బ్రిడ్జి

- ఐదో పిల్లర్ కింద తేలిన స్టీలు, కంకర

మదనాపురం,ఏప్రిల్17: మండలంలోని ఆత్మకూర్, వనపర్తి రహదారిపై గల కొత్తపల్లి గ్రామ సమీపంలో నిర్మించిన బ్రిడ్జి ప్రమాదంలో ఉంది. గతంలో ఇక్కడ మూడు సంవత్సరాల కిందట టీఎస్ఎండీసీ సంస్థ ద్వారా ఇసుక టెండర్లు ఆహ్వానించి ఇసుక తోడ్డారు. ఇసుక బ్రిడ్జి దగ్గర మొత్తం ఖాళీ కావడంతో వరద నీరు పిల్లర్‌ను కోయడం వలనే ఇలా జరిగిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు వెంటనే మరమ్మతు చర్యలు తీసుకోవాలని లేకపోతే బ్రిడ్జి కూలిపోయే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు.



కొత్తపల్లి బ్రిడ్జి దగ్గర ఉన్న పిల్లర్ కింద ఏర్పడిన గొయ్యి



శ్రీరంగాపురంలో..



అమరచింతలో సీతారాముల కల్యాణం కోసం ముత్యాల తలంబ్రాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు



వీపనగండ్ల సీతారాముల కల్యాణంలో పాల్గొన్న మంత్రి జూపల్లి

భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి

- వైభవంగా సీతారాముల కల్యాణం
- గోపాల్‌పేటలో సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించిన వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు
- ఆలయాల్లో ప్రముఖుల పూజలు
- కల్యాణాన్ని తిలకించిన భక్తులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా/వనపర్తి రూరల్ /గోపాల్‌పేట/శ్రీరంగాపురం/పెబ్బేరు రూరల్/ పెద్దమందడి/వీపనగండ్ల/కొత్తకోట/అమరచింత/ఆత్మకూరు/రేవల్లి /ఖిల్లాఘణపురం/పాన్‌గల్/పెబ్బేరు, ఏప్రిల్17: శ్రీరామనవమి పర్వదినాన్ని వనపర్తి జిల్లా వ్యాప్తంగా ప్రజలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవాలు కనులపండువగా సాగాయి. పలువురు ప్రముఖులు వేడుకల్లో పాల్గొన్నారు. వనపర్తి పట్టణంలోని సాయినగర్ సీతారామాంజనేయ స్వామి ఆలయం, వేంకటేశ్వర స్వామి ఆలయం, మర్రికుంట అభయాంజనేయ స్వామి ఆలయం, నాగవరం లక్ష్మి గణపతి ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూజారులు సీతారాముల కల్యాణాన్ని భక్తుల సమక్షంలో వైభవంగా జరిపిం చారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు వేశారు. తరువాత భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. ఎండలు మండిపోతున్నందున ప్రత్యేక టెంట్లు వేసి భక్తులకు నీడ కల్పించారు.

● స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

సాయినగర్ కాలనీలోని సీతారామాంజనేయ స్వామి ఆలయం, మర్రికుంట అభయాంజనేయ స్వామి ఆలయంలో వేడుకలకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. జిల్లా న్యాయాధికారి సునీత, మునిసిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన రాములోరి కల్యాణానికి హాజరయ్యారు. జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు శంకర్ ప్రసాద్, సీతారామాంజనేయ స్వామి ఆలయంలో కల్యాణ వేడుకలకు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

● వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెం, కడుకుంట్ల, సవాయిగూడెం, కిష్టగిరి, అంకూరు, చిట్యాల, అచ్యుతాపురం తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణం బుధవారం అంగరంగ వైభవంగా జరిపారు. సవాయిగూడెం గ్రామంలో రాజీవరెడ్డి, శివ యాదవ్ దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు, పుస్తె మెట్టెలను సమర్పించారు. అనంతరం బైక్ పోటీలు, చిన్నారులకు ఆటలు పోటీలు నిర్వహించారు.

● గోపాల్‌పేట మండల కేంద్రంలోని కోదండ స్వామి ఆలయంలో సీతారాముల వారికి ఎమ్మెల్యే మేఘారెడ్డి, శారదమ్మ దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి సత్యశీలారెడ్డి, టౌన్ అధ్యక్షుడు శివన్న, ఉపాధ్యక్షుడు నాగశేషి, జడ్పీటీసీ సభ్యురాలు భార్గవి, నాయకులు బాలయ్య శేఖర్, పార్థు, వెంకటయ్య, బాలయ్య, శివాలు, వెంకటిరెడ్డి, గాజుల కోదండం, ఉప్పరి యాదగిరి, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

● శ్రీరంగాపురం మండల కేంద్రంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంతో పాటు హనుమాన్ ఆలయంలో సీతారామ కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అలాగే కంభాళాపురం, తాటిపాముల, జానంపేట, తదితర గ్రామాలలో ఉత్సవాలు జరిగాయి. పెబ్బేరు మండలంలో సూగూరు, కొత్త సూగూరు, రంగాపురం, పెంచికలపాడు, శాఖాపురం, కంచిరావుపల్లి, యాపర్ల, గుమ్మడం, తిప్పాయిపల్లి, అయ్యవారిపల్లి, పాతపల్లి గ్రామాలలో ఆలయాల్లో సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహించారు.

● పెద్దమందడి మండలపరిధిలోని మద్దిగట్ల, జగత్‌పల్లి, దొడుగుంటపల్లి, చిన్నమందడి, అల్వాల, పెద్దమందడి గ్రామాల్లో రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● వీపనగండ్ల మండల పరిధిలోని గోవర్ధనగిరి, వల్లభాపూర్ గ్రామాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని సీతారాముల వారికి అక్షింతలు వేశారు. భక్తులకు మంత్రి అభివాదం చేస్తూ శ్రీరామనవమి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, ప్రజలు మంత్రి సన్మానించారు. అలాగే వీపనగండ్ల, తూముకుంట, కల్వరాల, పుల్గర్‌చర్ల తదితర గ్రామాలలో సీతారాముల ఉత్సవాలను నిర్వహించారు.



గోపాల్‌పేటలో రాములవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

● కొత్తకోటలోని కోట్లాంజనేయస్వామి, రాఘవేంద్రస్వామి ఆలయాల్లో నిర్వహించిన రాములవారి కల్యాణంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధు సూదన్‌రెడ్డి పాల్గొన్నారు. కొత్తకోటలో మునిసిపల్ చైర్‌పర్సన్ సుకేశిని, అమడబాకులలో జడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, కనిమెట్టలో ఎంపీపీ గుంత మౌనిక కల్యాణోత్సవంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు ప్రశాంత్, గొల్లబాబు, డాక్టర్ పీజే. బాబు, కృష్ణారెడ్డి, బోయోజ్, మేస్త్రీ శ్రీను, శేఖర్‌రెడ్డి, వేములశ్రీను, నరేందర్‌రెడ్డి, రాము, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే రాయనిపేట, విలియంకొండ, మిరాసిపల్లి, నాటవెల్లి, పామాపురం, రామకృష్ణాపురం, వడ్డెవాట, చర్లపల్లి గ్రామాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

● అమరచింత మార్కండేయ ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు. అలాగే నందిమల్ల, మస్తీపూర్, కృష్ణంపల్లి, పామిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో సీతారామ కల్యాణం జరిగింది. అమరచింత పట్టణంలోని సీతాకోదండ రామస్వామి దేవాలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు మోదీ మనోహర్ శెట్టి ఇంటి నుంచి స్వామి వారి ముత్యాల తలంబ్రాలను ఊరేగింపుగా మేళతాళాలతో తీసుకొచ్చారు. కల్యాణం శివశక్తి స్వామి అర్చక బృందంచే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మోదీ మనోహర్ రాజు, కొంగరి భాస్కర్, విష్ణు, కమ్మరి శ్రీనివాసులు, తాటికొండ రమేష్, ఎర్ర సత్యనారాయణ , విజయ్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, నరసింహ, గోపి, యాదగిరి, రాజు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు మండలంలోని ఆయా గ్రామాలలో సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని నీలకంఠేశ్వర స్వామి, వెంకటేశ్వర స్వామి, రామాలయం పీజేపీ క్యాంపు కార్యాలయాల ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

● రేవల్లి, నాగపూర్ గ్రామాల్లో సీతారాముల కల్యానం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు యువకులు భక్తులు గ్రామస్థులంతా అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● ఖిల్లాఘణపురం మండలంలోని సోలీపూర్ , కమలొద్దిన్‌పూర్, ఆగారం, మామిడిమాడ , మానాజీపేట, వెంకటంపల్లి , సల్కెలాపురం, ఖిల్లాఘణపురం గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయం ఆవరణంలో బుధవారం శ్రీరామనవమి సందర్భంగా రాములోరి కల్యాణం రమణీయంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కుమ్మరిగేరి ఆంజనేయ స్వామి ఆలయం కమిటీ సభ్యులు డప్పుల వాయిద్యాలు మహిళల మంగళహారతులతో శ్రీరామనామజపంతో భక్తి శ్రద్ధలతో సీతారాముల కల్యానం వైభవంగా నిర్వహిం చారు.

● పాన్‌గల్, కేతేపల్లి, రేమద్దుల, చింతకుంట, తెల్లరాళ్లపల్లి తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రామాలయంలో ఎంపీటీసీ సభ్యురాలు హైమావతి, బ్రహ్మయ్య, చింతకుంట గ్రామంలో ఆలయ ధర్మకర్త కుమార్‌గౌడ్ శారద దంపతులు కల్యాణం జరిపించారు. భక్తులకు కుమార్‌గౌడ్ కుమార్తెలు అనూష, ప్రియాంకలు అన్నదానం చేశారు.

● పెబ్బేరు మునిసిపాలిటీ కేంద్రంలో భకాంజనేయస్వామి దేవాలయం నుంచి హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఇంటింటా భజన మన ఇంట్లో భజన కార్యక్రమం ప్రారంభించారు. షిరిడి సాయిబాబా, అయ్యప్పస్వామి వారి గంధోత్సవం ప్రారంభమై భజన కీర్తనలతో సీతారాములు వారి ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపుగా శ్రీ వీరంపేట హనుమాన్ దేవస్థానానికి తీసుకొచ్చి అభిషేకాలతో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఇంటింటా భజన మనింట్లో భజన కార్యక్రమం ఏర్పాటు చేసిన వారికి మొక్కను, కాషాయపు ధ్వజం అందజేశారు. అనంతరం రాఘవేంద్ర హస్పిటల్ వారు హైందవ సాంప్రదాయం హిందూ క్యాలెండర్‌ను పెబ్బేరు హిందూ జాగృతం వారిచే ఆవిష్కరించారు. అలాగే శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో కూడా సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణం చూడటానికి వేలాది మంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.



కొత్తకోటలో రాములోరి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



వనపర్తిలోని రామాలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న చిన్నారెడ్డి



ఖిల్లాఘణపురంలో సీతారాముల విగ్రహాల ఊరేగింపు



పెబ్బేరులో భజనలతో విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



పెద్దమందడి సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పంటలు ఎండుతున్నా పట్టించుకోని ప్రభుత్వం

- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు

వనపర్తి రూరల్,ఏప్రిల్17: పంటలు ఎండుతున్నా పట్టించుకోని కాంగ్రెస్ ప్ర భుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు అన్నారు. బుధవారం వనపర్తి మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పోతు శ్రీనివాసులు ఆధ్వర్యంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు , మాజీ సర్పంచ్ ఎద్దుల దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి పోతు శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షుడు కాటమోని శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు జంగిడి బాలరాజు, పరికి శ్రీనివాసులు, బూత్ కమిటీ అధ్యక్షులు దేశినేని భాస్కర్ రావు, జంగిడి యాదగిరి, క్యాదగిరి ప్రదీప్ కుమార్, చెంబుల రమేష్, పెద్దముక్కల వెంకటేష్, మండ్ల ఆంజనేయులు, గుట్టకాడి ఆంజనేయులు , వాకిటి అనిల్ కుమార్, మండ్ల రామస్వామి, వాకిటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బీజేపీ అధికార ప్రతినిధి పెద్దిరాజు

సమస్యలు పరిష్కరించాలి

అమరచింత, ఏప్రిల్17: అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సి.రాజు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భవననిర్మాణ, మధ్యాహ్న భోజన, బీడీ కార్మిక తదితర రంగాల్లో కార్మికులపై దృష్టి సారించి కార్మిక చట్ట ప్రకారం రావాల్సిన ఆలయన్స్, బీమా తదితర సౌకర్యాలు సమకూర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత

శ్రీరంగాపురం,ఏప్రిల్17: మండల కేంద్రానికి చెందిన ఎస్సీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ ఎస్సీ విభాగం మండల ప్రధాన కార్యదర్శి ఆశన్న కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. శ్రీరంగాపురంలో సర్వే నెంబర్ 34,91లో ఎస్సీలకు పట్టా సర్టిఫికెట్లు ఇచ్చిన ఏళ్లు గడుస్తున్నా నేటికి లే అవుట్ వేయకుండా ఇళ్ల స్థలాలను చూపించాలని, వెంటనే స్థలాలను లబ్ధిదారులకు అప్పగించాలని కోరారు.

మృతదేహానికి నివాళి

చిన్నంబావి, ఏప్రిల్17: మండల పరిధిలోని గూడెం గ్రామానికి చెందిన గొందిపర్ల గోవిందు (45) గుండెకు సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో బుధవారం మరణించాడు. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గోవిందు మృతదేహానికి పూలమాలలేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇచ్చారు. నాయకులు చంద్రశేఖర్ యాదవ్, మండడి చిదంబర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, బీచుపల్లి యాదవ్, గజ్జి ఈదన్న యాదవ్, జుర్రు రామస్వామి యాదవ్ ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ పార్టీకి బుద్ధి చెప్పాలి



సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

వనపర్తి టౌన్, ఏప్రిల్ 17: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ పార్టీకి బుద్ధి చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో వామపక్షాల జిల్లా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జాన్‌వెస్లీతో పాటు సీపీఐఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కృష్ణరెడ్డి హాజరై మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి రాకముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై ప్రధానమంత్రి స్పందించకపోగా కనీసం ఆరాష్ట్రంలో పర్యటించి బాధితులను పరామర్శించిన పాపాన పోలేదన్నారు. బీజేపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఏమాత్రం స్పష్టమైన విధానాలు చూపలేదని విమర్శించారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ, రైతు ఉద్యమాలను అణిచివేస్తున్న మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే నిర్బంధ కాండ పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కులాలు, మతాల మధ్య విద్వేషాలు పెంచుతూ ఎన్నికల్లో లబ్ది పొందాలని చూస్తుందన్నారు. బీజేపీ హయాంలో పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు ఆకాశాన్ని తాకాయని, వాటిని అదుపు చేయడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని తిరగరాస్తామని బీజేపీ ప్రకటించడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, పుట్ట ఆంజనేయులు, బాల్‌రెడ్డి, జీఎస్ గోపీ, లక్ష్మి, మేకల ఆంజనేయులు, ప్రసాద్, రాజన్న, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

పాన్‌గల్, ఏప్రిల్ 17: మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో పాన్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం గ్రామస్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ వేసవిలో ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ ఒక్కరు లీటర్ నీళ్లలో ఒక ఓఆర్ఎస్ ప్యాకెట్లు కలుపుకొని తాగాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సతీష్, ఏఎన్ఎం ఎస్తేరమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్, ఏప్రిల్17: మండల పరిధిలోని అన్నారం తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు రేఖ్యానాయక్ మాతృమూర్తి తుక్రమ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రవికుమార్, రాములుయాదవ్ బుధవారం గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచు మహేశ్వర్‌నాయుడు, కాంగ్రెస్ నాయకులు ఏకరాముడు, రమేష్, బూసి, లాలు పాల్గొన్నారు.

యువకుడికి సైకిల్ వితరణ



యువకుడు కార్తీక్‌కు సైకిల్ అందిస్తున్న హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 17: పట్టణంలో కర్రోళ్ల కార్తీక్ అనే యువకుడు ఆర్థిక స్థోమత లేకపోవడం వల్ల నడుచుకుంటూ ఇంటింటికి తిరిగి న్యూస్ పేపర్ వేసేవాడు. విషయం తెలుసుకున్న ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా కమిటీ సభ్యులు కార్తీక్‌కు నూతన సైకిల్ ఇప్పించి జీవనోపాధికి చేయూత అందించారు. కమిటీ సభ్యులకు కార్తీక్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీటీ శ్యాం, విశ్వంబాబు, గద్వాల ఆంజనేయులు, చంద్రశేఖర్, ద్వారపోగు శివ పాల్గొన్నారు.